# తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలి:మంత్రి పువ్వాడ



ఖమ్మం, మే 30:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో అధికారులతో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంత్రి సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాకు ఘనమైన కీర్తి ఉందని, పరిపాలన అద్భుతంగా సాగుతుందని, అనేక విజయాలను సాధించామని, ఇది అధికారుల కృషితో సాధ్యమైనదని అన్నారు. ఆరోజు తెలంగాణ సాధనలో ఉద్యోగులు సకలజనుల సమ్మెతో తెలంగాణ ఆకాంక్షను రగిల్చారని, సాధించిన తెలంగాణలో అభివృద్ధికి అదే ఆకాంక్షతో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని మంత్రి తెలిపారు. ఉత్సవాలను 21 రోజుల పాటు నిర్వహించ నున్నట్లు ఆయన అన్నారు. జూన్ 2న అమరవీరులకు నివాళులర్పించి, ఐడిఓసిలో పతాకావిష్కరణ ఉంటుందని, సాయంత్రం లకారం లో సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయని ఆయన అన్నారు. జూన్ 3న రైతుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని 129 రైతు వేదికల్లో పెద్ద ఎత్తున రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు ఎడ్ల బండ్లలో, ట్రాక్టర్లలో, ద్విచక్రవాహనాలపై ఊరేగింపుగా రైతు వేదికకు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని, రైతులకు ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుభీమా, ఉచిత విద్యుత్ తదితరాలపై ప్రభుత్వం ఎంత ఖర్చుచేస్తున్నది, పథకాలకు పూర్వం పరిస్థితి, ఇప్పటి పరిస్థితి పై అవగాహన కల్పించాలన్నారు. రైతుభీమా పొందిన కుటుంబంతో వారు పొందిన లబ్దిని వారితోనే చెప్పించాలన్నారు. ముందస్తు సాగు, పంటల మార్పిడిపై రైతులకు ప్రయోజనాలను వివరించాలన్నారు. జూన్ 4న సురక్షా దినోత్సవం జరపాలని, ప్రజలకు షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని, ర్యాలీలు చేపట్టాలని, మంచి పౌరులు, విశిష్ట సేవలందించిన పోలీసులను సత్కరించాలని అన్నారు. జూన్ 5న విద్యుత్ దినోత్సవం పురస్కరించుకుని సబ్ స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలు అలంకరించాలని, తెలంగాణ కు పూర్వం రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, ఇప్పుడు పరిస్థితిపై, విద్యుత్ రంగంలో ఆదర్శంగా నిలిచిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జూన్ 6న పారిశ్రామిక ఉత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతిని తెలియజేయాలన్నారు. జూన్ 7న సాగునీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు చేపట్టి, సాగునీటి రంగంలో రాష్ట్రం ఏర్పడ్డాక సాధించిన ప్రగతిని ప్రజల ముందు ఉంచాలన్నారు. జూన్ 8న చెరువుల పండుగను పురస్కరించుకుని గ్రామ గ్రామాన చెరువుల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, కట్టలపై భోజనాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. జూన్ 9న తెలంగాణ సంక్షేమ సంబరాలను పురస్కరించుకుని రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభోత్సవం ఉంటుందని, సాంఘీక సంక్షేమ శాఖచే సేకరించిన 58 ఎకరాలను భూమిని, ఇండ్లులేని 3000 వేల మందికి పట్టాల పంపిణీ చేయనున్నట్లు, బిసి సంక్షేమ శాఖ ద్వారా బిసిలకు చెక్కుల పంపిణీ, కళ్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్ల తదితర లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆయన అన్నారు. జూన్ 10న సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రొత్తగా ఏర్పాటైన మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాల దగ్గర సంబరాలు చేపట్టాలని, క్రొత్తగా ఏర్పాటుతో కల్గిన ప్రయోజనాలను కరపత్రాల రూపంలో ప్రచురించి ప్రజలకు వివరించాలని అన్నారు. జూన్ 11న సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భక్త రామదాసు క్షళాక్షేత్రంలో కవి సమ్మేళనం, కవితల పోటీలను నిర్వహించాలని మంత్రి తెలిపారు. జూన్ 12న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ ను చేపట్టాలని ఆయన అన్నారు. జూన్ 13న మహిళా సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని మహిళా ఉద్యోగినులకు సన్మానం చేయాలని, మహిళలకు రాష్ట్ర ప్రభుత్వంచే అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. జూన్ 14న వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య రంగంలో ఆనాటి సౌకర్యాలు, ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి, పల్లె, బస్తీ దవాఖానాలు, ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు, ఆరోగ్య మహిళ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. జూన్ 15న పల్లెప్రగతి దినోత్సవం పురస్కరించుకుని గ్రామాల్లో సౌకర్యాల కల్పనపై ప్రజలకు వివరించాలని, నూతన పంచాయితీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉత్తమ సర్పంచులు, ఎంపీపీ లకు సన్మానాలు చేయాలని మంత్రి తెలిపారు. జూన్ 16న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం పురస్కరించుకుని మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో 9 సంవత్సరాల ప్రగతిని ప్రజలకు వివరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. జూన్ 17న గిరిజనోత్సవం పురస్కరించుకుని గిరిజన గ్రామాల్లో 10 శాతం రిజర్వేషన్లు, గిరివికాసంతో లబ్దిపై అవగాహన కల్పించాలన్నారు. జూన్ 18న మంచినీళ్ళ పండుగను ఘనంగా చేపట్టాలని, త్రాగునీటి విజయాలపై సభలు నిర్వహించాలని అన్నారు. జూన్ 19న హరితోత్సవం పురస్కరించుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటుటకు ఏర్పాటు చేయాలని అన్నారు. జూన్ 20న తెలంగాణ విద్యా దినోత్సవం పురస్కరించుకుని మన ఊరు-మన బడి కార్యక్రమ పనులు పూర్తితో పాఠశాలల పునః ప్రారంభ కార్యక్రమాలు చేయాలని, పిల్లలకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీ చేయాలని అన్నారు. వ్యాసరచన, ఉపన్యాసాలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 21న ఆధ్యాత్మిక దినోత్సవం పురస్కరించుకొని, ఆలయాలు, మసీదులు, చర్చీలు అలంకరించాలని, ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేపట్టాలని అన్నారు. జూన్ 22న అమరులకు నివాళులు, స్మారక చిహ్నాల ప్రారంభోత్సవం చేయాలని అన్నారు. గ్రామ, మండల, మునిసిపల్, జిల్లా పరిషత్ స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, అమరులకు నివాళి తీర్మానం, 2 నిమిషాల మౌనం పాటించాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 2 నిమిషాలు మౌనం పాటించాలని మంత్రి అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాలు వైభవోపేతంగా చేపట్టాలని మంత్రి తెలిపారు.

సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, 21 రోజులు ఉత్సవాలు ఘనంగా చేపట్టాలన్నారు. ఉద్యమ సమయంలో ఘట్టాలను ప్రధాన కూడళ్ళలో ప్రదర్శించాలని, 2014 కు పూర్వం, 2014 తర్వాత సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. తొమ్మిదేండ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను ప్రజల్లోకి తెలుపాలన్నారు.

సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో అధికారులతో సమావేశమై వేడుకలు పెద్దఎత్తున ఘనంగా చేపట్టుటకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. తెలంగాణ సాధనకు చేపట్టిన స్ఫూర్తిని, సాధించిన తెలంగాణ అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, వేడుకలను గొప్పగా జరుపుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, అధికారులకు వేడుకల నిర్వహణపై అవగాహన కల్పించినట్లు, సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి, శిక్షణా సహాయ కలెక్టర్లు రాధిక గుప్తా, మయాంక్ సింగ్, జిల్లా రైతుబంధు సమితి కన్వీనర్ ఎన్. వెంకటేశ్వర రావు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

# పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## -దేశవ్యాప్తంగా ధర్నాలు-నిరసనలు.



హైదరాబాద్, మే 30:పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని మరియు కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అలా లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి దేశ వ్యాప్తంగా ధర్నాలు ? నిరసనలు చేస్తామని రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ముఖ్య నాయకుల సమావేశం నేడు బి.సి భవన్ లో జరిగింది. సమావేశానికి గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. దక్షిణాది రాష్ట్రాల బి.సి యువజన సంఘం కన్వీనర్ శంకర్ సమన్వయం పరిచారు. కర్నాటక రాష్ట్రానికి కన్వీనర్ మరియు రాష్ట్ర ఇంచార్జ్ గా అవినాష్ ను ఎన్నుకున్నారు. కర్నాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, తమిళనాడు, అస్సాం, ఒరిసా తదితర రాష్ట్రాలలో పర్యటించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించారు. బీసీలు పార్టీలకతీతంగా బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. త్వరలోనే దేశవ్యాప్త పర్యటన చేస్తామని అన్నారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఈ దేశంలో గత 75 సంవత్సరాల గా పాలించిన కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదు. ఉద్యోగ రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదు ఇది ప్రజాస్వామ్య దేశం ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇవ్వాలి కానీ 70 సంవత్సరాలు గడిచిన వాటా ఇవ్వడం లేదు. బి.సి లంటే ఉత్పత్తి కులాలు. దేశ సంపద సృష్టిస్తున్నారు. కాని సంపద అనుభవించే హక్కు లేదు. అవకాశం లేదు. పన్నులు కట్టే దేశ బడ్జెట్ ఇస్తున్నారు. కాని బడ్జెట్ లో కనీస వాటా లేదు. ఓట్లు వేసి అధికారం ఇస్తున్నారు. కాని అధికారులు బి.సి లకు వాటా ఇవ్వడం లేదు. ఈ దేశం లో బి.సిలకు ఇలా అన్యాయం జరుగుతుందన్నారు. ఇది ప్రజస్వామ్య దేశం అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి, వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలి. అప్పుడు దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి ఉంటుంది. అందుకోసం బి.సి లకు రావలసిన వాటా కోసం మరోసారి అధ్యయనం జరుగాలన్నారు. ఈ సమావేశంలో మరేష్ (ఆంధ్ర ప్రదేశ్), సత్యనారాయణ (తెలంగాణ), పి. సుధాకర్, నీల వెంకటేష్, అంజి, శ్రీనివాస్ (కర్నాటక), శక్తి వేలు (తమిళనాడు), వేముల రామ కృష్ణ, సి. రాజేందర్, నందగోపాల్, భూపేష్ సాగర్, నాని ముదిరాజు తదితరులు ప్రసంగించారు.

# తెలంగాణ ఉద్యోగుల సంఘం కరువు భత్యం బకాయి విడుదల చేయండి

## -ముఖ్యమంత్రి కి తెలంగాణ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి



హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న సందర్భంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ప్రారంభించడం మరియు అమరవీరుల స్మారక చిన్నం నిర్మిమ్పజేయడం పట్ల గౌరవ ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యోగుల సంఘం హార్దిక అభినందనలు తెలిపింది. ఈ మేరకు సచివాలయం మీడియా సెంటర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం రవీంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి సి హరీష్ కుమార్ రెడ్డి, హనరరీ చర్మెన్ ఏ.పద్మా చారి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం దశాబ్ద ఉత్సవాలను జరుపుకుంటున్న వేల పండుగ వాతావరణం లో సమస్త తెలంగాణ ప్రజానికం సంతోషాన్ని ఆనందాన్ని కలిగి ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల్లో భాగమైన తెలంగాణ ఉద్యోగులకు రావలసిన మూడు విడుదల కరువు బత్యం విడుదల చేయవలసిందిగా ముఖ్యమంత్రి కే.చంద్రశేకర్ రావు ను కోరారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత రావాల్సిన రెండు వేతన సవరణ కమిటీని పిఆర్సి వెంటనే నియమించి ఉద్యోగులకు న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశం లో ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ జి జాకబ్, పి కృష్ణారావు, గ్రేటర్ హైదరాబాద్ అద్యక్షులు నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపిలో ఎటు చూసినా నేరాలు-ఘోరాలు..

## -టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

అమరావతి మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్లపాలనపై టీడీపీ ఛార్జ్ షీట్ వేసిందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 4 ఏళ్ల జగన్ పాలన చూస్తే ఏమున్నది గర్వకారణం అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ఎటు చూసినా నేరాలు- ఘోరాలు, లూఠీలు, విధ్వంసాలు, విద్వేషాలు, అబద్ధాలే కనిపిస్తున్నా యన్నారు. సీబీఐ భయంతో తన నివాసంలో ముఖ్యమంత్రి బిక్కుబిక్కుమంటూ అభద్రతాభావంలో ఉన్నారని అన్నారు.

జగన్ తాను ముఖ్యమంత్రి కావడానికి ఒక ప్రణాళిక వేసుకుని 2019 మార్చి15న చేసిన ఒక కార్యక్రమమే, నాలుగేళ్ల తర్వాత ఆయన బిక్కుబిక్కుమంటూ ఇంట్లో కూర్చునే విషాదకరమైన పరిస్థితికి కారణమైందని వర్ల రామయ్య అన్నారు. వివేకానంద రెడ్డి హత్య విషయం జగన్మోహన్ రెడ్డికి ముందే తెలుసునని సీబీఐ హై కోర్టు లో అఫిడవిట్ వేశాక కూడా ముఖ్యమంత్రి పదవిలో ఆయన కొనసాగడం నిజంగా సిగ్గుచేటన్నారు. హత్యకేసులో సీబీఐ జగన్ పేరు ప్రస్తావించాక కూడా ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక అర్హత ఉందా? అని జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నిస్తున్నామని వర్ల రామయ్య అన్నారు.

# ఆర్డినెన్స్‌కువ్యతిరేకంగా కేజ్రీవాల్ పోరాటానికి సీపీఎం మద్దతు

న్యూఢిల్లీ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఢిల్లీపై కేంద్రం ఆర్డినెన్స్‌కువ్యతిరేకంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న పోరాటానికి సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మద్దతు ప్రకటించారు. ఢిల్లీలో అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులను తమ అధీనంలో ఉండేలా కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను సీతారాం ఏచూరి ఖండించారు. ఆర్డినెన్స్ స్థానే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే ఆప్‌కు తమ పార్టీ మద్దతిస్తుందని ఆయన ప్రకటించారు. ఈ విషయంలో కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు ఆప్‌కు మద్దతు ఇవ్వాలని ఏచూరి విజ్ఞప్తి చేశారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ పూర్తిగా రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. ఇదే పరిస్థితి బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న చోట్ల కూడా తలెత్తవచ్చని హెచ్చరించారు.కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో తమకు మద్దతివ్వాలని కోరుతూ కేజ్రీవాల్ మంగళవారం ఉదయం సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరిని కలుసుకున్నారు. అనంతరం సంయుక్తంగా విలేఖరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగవిరుద్ధమని, కోర్టు ధిక్కారం కూడా అవుతుందని ఏచూరి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు ముందుకు రావాలని కోరారు. కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను రాజ్యసభలోనే కాకుండా ఎక్కడైనా సరే తాము వ్యతిరేకిస్తామని ఏచూరి స్పష్టం చేశారు.ప్రభుత్వ సర్వీసుల నియామక అధికారాలు ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికే ఉంటాయని సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చింది. పోలీసులు, శాంతిభద్రతలు, భూములు ఢిల్లీ సర్కార్ పరిధిలోకి రావని తేల్చింది. అయితే, సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా ప్రభుత్వ అధికారుల నియామకాలపై మే 19న కేంద్రం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని ఆప్ వ్యతిరేకి స్తూ, విపక్ష పార్టీల మద్దతును కూడగడుతోంది. ఆర్డినెన్స్ స్థానే బిల్లును కేంద్రం ఆరు నెలల్లోపు పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆ బిల్లును విపక్షాలు ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్రానికి విపక్షాలు గట్టి సంకేతాలు ఇచ్చినట్టవుతుందని కేజ్రీవాల్ చెబుతున్నారు.

# ఎల్లమ్మతల్లి విందుకు హాజరైన నేతలు



ఖమ్మం, మే 30:(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల ఎంపీపీ గోసు మధు ఏర్పాటుచేసిన ఎల్లమ్మ తల్లి విందు కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి, మాజీ రాష్ట్ర మార్కెట్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని విజయభాయి, వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస రావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మా రోశయ్య, భానోత్ నరసింహారావు, నాయకులు రాయల పుల్లయ్య, మందపాటి వెంకటేశ్వరావు, కోనకంచి మోషే, యలమందల మధు, కనగంటి రావు, తుళ్లూరి నవీన్, షేక్ జాన్ పాషా, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తన అభిమాని కొన్న కొత్త కారును నడిపించిన ఎంపీ రవిచంద్ర

## - కేక్ కట్ చేసి కారు యజమాని గణేష్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రవిచంద్ర



ఖమ్మం, మే 30:(నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన చిరకాల అభిమాని గోలెపు గణేష్ నాయుడు కొన్న కొత్త కారును నడిపించి శుభాకాంక్షలు తెలిపారు

. ఖమ్మం నగరంలోని మహేంద్ర షోరూంలో గణేష్ కొత్త థారు (కారు)ను కొనుగోలు చేశారు. గణేష్ కోరిక మేరకు ఎంపీ రవిచంద్ర మహేంద్ర షోరూంకు వెళ్లి తన అభిమానుల చప్పట్లు,హర్షధ్వానాల మధ్య కేక్ కట్ చేసి కారు నడిపించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గణేష్ ఎంపీ రవిచంద్రను శాలువాతో సత్కరించారు.

# రాష్ట్రం అవతరణ దశాబ్ది ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలి..మంత్రి పువ్వాడ

ఖమ్మం, మే 30:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని, రాష్ట్రంగా ఏర్పడిన అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశించారు.

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల సన్నాహక సమావేశంలో జిల్లా అధికారులను, ప్రజాప్రతినిధులకు మంత్రి పువ్వాడ పలు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం ఆయా ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించాలని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసేలా నిర్వహించాలన్నారు.

ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర రావు, అదనపు కలెక్టర్ స్నేహాలత, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# అంగరంగ వైభవంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖమ్మం, మే 30:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో 2003-2004 సంవత్సరంలో 7వ తరగతి చదివిన 45 మంది పూర్వ విద్యార్థులు 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తాము చదివిన ఆరెంపుల పాఠశాల ప్రైమరీ స్కూల్ నందు అత్యంత వైభవంగా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాంలో భాగంగా, తమకు చదువు చెప్పి మంచి విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను పూలతో స్వాగతం పలికి, వారిని ఘనంగా పూల మాల, శాలువా, జ్ఞాపికతో సత్కరించడం జరిగింది. అలాగే ప్రతి విద్యార్థికీ తమ గురువుల చేతుల మీదుగా జ్ఞాపికను అందిచడం జరిగింది. ఈ యొక్క ప్రోగ్రాంలో భాగంగా మొదటగా గురువుల చేత జ్యోతి ప్రజ్వలన చేయించి కార్యక్రమన్ని ప్రారంభించిన తర్వాత తమకు చదువు నేర్పించి, అలాగే తమతో పాటు చదివి ప్రస్తుతం స్వర్గస్తులైన వారికి రెండు నిముషాలు మౌనం పాటించడం జరిగింది. తర్వాత కార్యక్రమంలో భాగంగా అలనాటి తమ మధురనుభూతులను గుర్తు చేసుకుంటూ, విద్యార్థులు, మరియు ఉపాధ్యాయులు మురిసిపోవడం జరిగింది. అలాగే ఆటలతో, పాటలతో ఈ యొక్క కార్యక్రమం ఎంతో వైభవంగా జరగడంతో పాటు 20 సంవత్సరాల తర్వాత ఒకరిని ఒకరం చూసుకోడం అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం చెప్పలేని అనుభూతినీ, ఆనందాన్ని ఇచ్చిందని విద్యార్థులు తెలియజేయడం జరిగింది. ఈ బ్యాచ్ లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మిగిలిన వారు వివిధ ప్రైవేట్ ఉద్యోగులుగా, గృహిణిలుగా స్థిరపడడం జరిగింది.

# వైభవంగా గోవిందరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, మే 30:తిరుపతి గోవిందరాజ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా మాడ వీధుల్లో కోలాహలంగా వాహనసేవ జరిగింది.

అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి 9. 30 గంటల వరకు గరుడవాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారని అర్చకులు వెల్లడించారు.

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు మే 31 వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి.

ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశామన్నారు.

# సీఎం కప్ పోటీలతో నగరంలో క్రీడా సందడి

**–ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు**
**–అధికారుల సమన్వయం ' పకడ్బందీ ఏర్పాట్లు**
**–రాష్ట్ర క్రీడా చరిత్రలో ఇదో నూతనాధ్యాయం ' డాక్టర్ ఆంజనేయ గౌడ్**
**–విజేతలను అభినందించిన సాట్స్ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్**
**–నేడు 6 స్టేడియాల్లో ముగింపు వేడుకలు ' విజేతలకు నగదు పురస్కారాలు**





హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అత్యంత ఘనంగా ప్రారంభమైన 'సీఎం కప్ ' 2023' పోటీలతో నగరంలోని స్టేడియాల్లో సందడి నెలకొంది. 18 క్రీడాంశాల్లో నగరంలోని 6 స్టేడియాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో ముఖ్యమైన మ్యాచ్‌లు ముగిసాయి.

సీఎం కప్ ' 2023 రాష్ట్ర స్థాయి పోటీలో గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో అథ్లెటిక్స్, అర్చరీ, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్, ఎల్‌బి స్టేడియంలో హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, లాన్ టెన్నిస్ ' టేబుల్ టెన్నిస్, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియం, యూసఫ్‌గూడా స్టేడియంలో బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ, జిమ్నాస్టిక్స్, వాలీబాల్, జిఖానా గ్రౌండ్స్‌లో ఖో'ఖో, గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో షూటింగ్ పోటీలు, 33 క్రీడా జట్ల మధ్య పోటీలు తుది దశకు చేరుకున్నాయి.

జిల్లాల నుండి వచ్చిన గ్రామీణ క్రీడాకారులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేసి నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### పోటీల పరిశీలన ' విజేతలకు అభినందన

సీఎం కప్ పోటీల నిర్వహణతో తెలంగాణలో అద్భుతమైన క్రీడా స్ఫూర్తి వెల్లివిరిస్తోందని, రాష్ట్రంలో నూతన యువ ఛాంపియన్‌లతో ఆవిర్భావానికి దోహదం చేసిందని సాట్స్ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. సీఎం కప్ పోటీలో భాగంగా ఈరోజు పలు స్టేడియాలను సందర్శించి, పోటీలను వీక్షించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు అందజేశారు. ఈరోజు గచ్చిబౌలి స్టేడియంలో స్విమ్మింగ్, అర్చరీ, అథ్లెటిక్స్, యూసఫ్‌గూడా స్టేడియంలో రెజ్లింగ్, ఎల్‌బి స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలను ఆయన అభినందించారు.

దిగ్విజయంగా కొనసాగుతున్న సీఎం కప్ పోటీల నిర్వహణతో తెలంగాణ ఖ్యాతి మరోసారి జాతీయ స్థాయిలో మారుమ్రోగుతోందని, గ్రామీణ క్రీడా రంగ చరిత్రలో నూతనాధ్యయనం మొదలైందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ యువ క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం కల్పించే ఈ కార్యక్రమ రూపకల్పన అద్భుతమని క్రీడా రంగ నిష్ణాతులు ప్రశంసిస్తున్నారని ఆయన అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహకారంతో మరిన్ని క్రీడా కార్యక్రమాల రూపకల్పన చేస్తామని, సాట్స్ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తెలిపారు.

### నగదు పురస్కారాలు

ఈ పోటీల్లో విజేతలకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నగదు పురస్కారాలు అందజేస్తుంది. టీం ఈవెంట్లలో మొదటి స్థానానికి లక్ష రూపాయలు, రెండో బహుమతి 75 వేలు, మూడో స్థానం పొందిన వారికి 50 వేల నగదు పురస్కారాలు అందజేస్తుండగా, వ్యక్తిగత క్రీడాంశాల్లో గోల్డ్ మెడల్ విజేతకు 20 వేలు, సిల్వర్ మెడల్ విజేతకు 15 వేలు, బ్రాంజ్ మెడల్ విజేతలకు 10 వేల రూపాయల నగదు బహుమతులు అందజేస్తున్నారు. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులందరికి సర్టిఫికేట్లు ప్రధానం చేయనున్నారు.

### 6 స్టేడియాల్లో ముగింపు వేడుకలు

18 క్రీడాంశాల్లో సాగిన ఈ పోటీలు (31వ తేది మే, 2023) 6 స్టేడియాల్లో ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. ఎల్‌బి స్టేడియంలో జరగబోయే ముగింపు వేడుకలకు రాష్ట్ర హోం మంత్రి మహమద్ అలీ, జిఎంసి బాలయోగి స్టేడియంలోని వేడుకలకు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలోని వేడుకలకు పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే ముగింపు వేడుకలకు డిప్యూటి స్పీకర్ పద్మారావ్ గౌడ్, షూటింగ్ రెంజ్‌లో జరిగే వేడుకలకు నగరమేయర్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మిలు అతిథులుగా హాజరు కానున్నారు.

# "మాచన"..సమాజ హిత తపన
# 20 ఏళ్లుగా పొగాకు నియంత్రణ

హైదరాబాద్, మే 30(నేటినిజం ప్రతినిధి): :వాస్తవానికి ఓ డిప్యూటీ తహశీల్దార్ హోదా ఉన్న వ్యక్తికి... ఏదో సాధించాలన్న తపన.. ఆ తపనకు తగ్గ కమిట్మెంట్ ఉండటమంటే కాస్తా అరుదే. అలా ..అని ఎవరూ ఉండరని కారు. అలాంటివారిలో ఒకరే మనమిప్పుడు చెప్పుకునే రఘునందన్ మాచన. పౌరసరఫరాల శాఖ లో ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ గా ఎక్కడో ఓచోట నిత్యం దాడులు, తనిఖీలు నిర్వహించే క్రమంలో...ఎందరో అధికారుల్లాగే లంచాలకు మరిగి తానూ ఆర్థికంగా అందలమెక్కొచ్చు. కానీ అలా అయితే రఘునందన్ గురించి చెప్పుకోవడమెందుకు..?

తన సర్వీస్ లో రఘునందన్ కు ఉద్యోగ బాధ్యతే కావచ్చు.. కానీ అందులో మానవత్వం ఉంది. సమాజాన్ని ఉద్ధరించాలి, మార్చాలన్న తపన కనిపిస్తుంది. అందుకే ఈ అరుదైన అధికారికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. పొగాకు నియంత్రణలో రఘునందన్ డెడికేషన్ జర్మనీ దేశాన్నీ టచ్ చేసింది. ఇప్పుడు రఘునందన్ ను ఆ దేశ ప్రతినిధులు తమ వద్దకు రావాలని ఆహ్వానిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పుకార్లు, ఫార్వర్డ్లు, తమకు గిట్టనివారిని ఉతికారేసే ఇష్టారీతి ద్వేషపు రాతలు రాసే వాళ్లే కనిపించే రోజుల్లో... పొగాకు నియంత్రణపై రఘునందన్ అదే సామాజిక మధ్యమాలనుపయోగించుకుని కల్పిస్తున్న అవగాహన అంతర్జాతీయ సమాజాన్నీ చేరుతోంది.

#SayNoToTOBACCO
#QuitTOBACCO
#SmokingKills

అంటూ ట్విట్టర్ ద్వారా ఆయన పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారం, జర్మనీని ఆకట్టుకోగా... ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తగిన గుర్తింపు ఇచ్చింది. వైద్యుడు కానప్పటికీ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్..తన కార్యక్రమాలకు రఘునందన్ ను ఆహ్వానిస్తోంది.

అయితే ఇంతేనా.. మాచన అంటే...? పంజాబ్ ఛండీగడ్ లో జరిగిన పొగాకు నియంత్రణ అంతర్జాతీయ సదస్సులోనూ "మాచన"నే భారత్



నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ గౌరవ ప్రతినిధిగా పాల్గొనడమంటే దానివెనుక ఆయన అవిరళ కృషే కారణం. పొగాకు ఉత్పత్తుల వల్ల ఆరోగ్యానికీ, ఐశ్వర్యానికీ ముప్పు కలగక ముందే.. టుబాకో కు గుడ్ బై చెప్పే అవగాహన ప్రతి ఒక్కరిలో కల్గాలని ఆశిస్తున్న వ్యక్తి మాచన. మాచన రఘునందన్ ది సుమారుగా రెండు దశాబ్దాల కృషి. అయితే ఆ ఫలాలు ఇప్పుడు అందుతున్నాయి. ఆయన ఆశించిన మార్పు ఆయనెంచుకున్న లక్ష్యాల్లో కనిపిస్తోంది. ఆయన పేరూ హైదరాబాద్ జిల్లా దాటి.. రాష్ట్రవ్యాప్తమై.. దేశం గుర్తించి... అంతర్జాతీయ సమాజానికీ వినిపిస్తోంది.

మేడ్చల్ జిల్లా కేశవరం కు చెందిన "మాచన"..రంగారెడ్డి జిల్లాలో ఆంగ్లభాషా పండితుడిగా పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి పురస్కారాన్నందుకున్న అభిమన్యు కుమారుడు. సాధారణంగా పండిత పుత్ర పరమశుంఠ అని నానుడి. కానీ.. మాచన అందుకు భిన్నం. ఇప్పుడు తన కుటుంబం మొత్తం గర్వించదగ్గ రీతిలో తన ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూనే... పొగాకుపై ఉద్యమం చేస్తున్న పోరాటశీలి. అందుకే జాతీయస్థాయిలో పొగాకు నియంత్రణకు కృషి చేస్తున్న రిసోర్స్ సెంటర్ ఫర్ టుబాకో కంట్రోల్ ... రఘునందన్ ని "టుబాకో కంట్రోల్ స్టాల్ వర్ట్" గా గుర్తించింది. అమెరికాకు చెందిన హెల్త్ మ్యాగజీన్ పల్మనరీ మెడిసిన్ కూడా రఘునందన్ విజయగాధను వావ్.. వెల్డన్. అని కొనియాడింది. ఈమధ్యే రఘునందన్ విధి నిర్వహణలో కనబరుస్తున్న చొరవతో పాటే... ఆయన ఆశయాలు.. వాటికై "మాచన" పోరాటం గురించి తెలుసుకున్న పలువురు రఘునందన్ ను అభినందించడంతో తన బాధ్యత మరింత పెరిగిందంటారు "మాచన".

రఘునందనంటే ఓ నిబద్ధత గల ఉద్యోగి... తన విధులను బాధ్యతగా నిర్వహిస్తూనే... సమాజ హితం కోసం పోరాడే శ్రేయోభిలాషి. ఆరోగ్యానికి చేటు చేస్తున్న పొగాకు ఉత్పత్తుల వాడకం ను కూకటివేళ్లతో పెకిలించే చైతన్యం సమాజం నుంచే రావాలని పోరాడుతున్న ఉద్యమశీలి.. వీటన్నింటినీ మించి సామాన్యుల పాలిట సాటి మనిషిగా స్పందించే మానవీయకోణం.. మొత్తంగా మన రాష్ట్రం వాడు.. మనవాడు... నిత్యం అందరిలో ఒకడు.. కానీ, తనకంటూ ఓ ప్రత్యే'కథను' సంతరించుకుంటున్నవాడు.. రఘునందన్ మాచన.

రఘునందన్ మాచన ఈ జర్నీ మరింత ముందుకెళ్లాలని... మరెందరో అధికారులకు, సామాన్యులకు ఈయన స్ఫూర్తి ఓ ప్రేరణ కావాలనీ ఆశిద్దాం.

*(మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం)*

# ఈత కోసం వెళ్లి అనంతలోకాలకు..
# ఇద్దరు యువకుల మృతి

హైదరాబాద్, మే 30:బావిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లిన ఇద్దరు యువకులు నీటమునిగి చనిపోయారు. ఈ ఘటన వికారాబాద్? జిల్లా మోమిన్ పేట్ మండలంలో నిన్న(సోమవారం) జరిగింది. కాగా, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా ఇవ్వాల (మంగళవారం) వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన గారేల గోవర్ధన్ (25) సోమవారం తన బైక్?మీద బయటికి వెళ్లి వస్తానని చెప్పాడు. గ్రామ పరిధిలోని గారెల భీమయ్యకు చెందిన బావిలో గోవర్ధన్ ఈత నేర్చుకుందామని వెళ్లాడు.

అతనితోపాటు గ్రామస్తులు అభిలాష్, గారెల యాదయ్య కూడా వెళ్లి గోవర్ధన్ నడుముకి ప్లాస్టిక్ డబ్బా కట్టి ఈత నేర్చుకోవడానికి సహాయపడ్డారు. అయితే.. గోవర్ధన్? బావిలో దూకినప్పుడే నడుముకు కట్టిన ప్లాస్టిక్? డబ్బా ఊడిపోయింది. దీంతో అతను నీటిలో మునిగిపోతుంటే అభిలాష్, యాదయ్య నీటిలోకి దూకి అతన్ని కాపాడే ప్రయత్నం చేశారు. కానీ, గోవర్ధన్?తోపాటు అభిలాష్ (16) కూడా నీళ్లల్లో మునిగి చనిపోయాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈత నేర్చుకుందామనే క్రమంలో చనిపోయాడు, కానీ, ఇతరత్రా కారణాలు లేవని.. తమ కుమారుల చావులో అనుమానం లేదని బాధిత కుటుంబ సభ్యులు చెప్పినట్టు ఎస్ఐ విజయ ప్రకాష్ తెలిపారు.

# విద్యుత్ కొరత నుంచి త్వరలో మిగులుకు చేరుకోబోతున్నాం : టీఎస్ జెన్‌కో ఛైర్మన్



జయశంకర్ భూపాలపల్లి , మే 30:ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాష్ట్రం విద్యుత్ కొరత నుంచి మిగులుకు చేరుకోబోతుందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఎర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూ కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన పర్యవేక్షక ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ (విద్యుత్ ప్రగతి భవన్) భవనాన్ని మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడే నాటికి కరెంట్ వినియోగం సగటున 1136 యూనిట్లు కాగా నేడు 2140 యూనిట్లకు చేరుకుందని వివరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు రైతాంగం అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పగలుమూడు గంటలు, రాత్రి మూడు గంటల కరెంట్ వల్ల రైతులు పొలాలవద్దే పడుకునేవారని , పాము, తేళ్ల కాటుకు, కరెంటు ప్రమాదాలకు లోనయ్యేవారని వివరించారు.

అప్పటి పరిస్థితి నేడు లేదని, అందరికి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ఆదేశాలతో హైదరాబాద్‌లో అందిస్తున్న మాదిరిగా నాణ్యమైన విద్యుత్‌ను మారుమూల ప్రాంతాలకు కూడా ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి కరెంట్ జనరేషన్, డిస్ట్రిబూషన్, ట్రాన్స్‌మిషన్లపై రూ. 97,500 కోట్లు పెట్టుబడి పెట్టిందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబూషన్ నెట్‌వర్క్ కోసం 40 వేల కోట్లు వెచ్చించడడం వల్ల నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.

భూపాలపల్లి సెకండ్ స్టేజ్ కింద 600 మెగావాట్ల ప్రాజెక్టును చేపట్టి ఏడాదిలోపు పూర్తి చేసి సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చేనాటికి 7778 మెగావాట్ల కెపాసిట్ ఉండగా నేడు 18,565 మెగావాట్ల కెపాసిట్ వరకు పెంచామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమయ్యే విద్యుత్ ఇచ్చే స్థితిలో ఉన్నామని తెలిపారు. వీటితో పాటు పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతలకు అవసరమయ్యే 6500 మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని వివరించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ దూరదృష్టితో మిర్యాల గూడ దామరచర్ల వద్ద 4వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తికి రూ. 34 వేల కోట్లతో చేపట్టామని త్వరలో దాన్నికూడ ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎన్పీడీసీఎల్ సీఎండి అన్నమనేని గోపాల్ రావు, జెన్కో,ట్రాన్స్‌కో డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సీఎండీ మొక్కను నాటారు .

# రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం : మంత్రి జగదీశ్ రెడ్డి




నల్లగొండ, మే 30: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలు, ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వినూత్న పథకాలు అమలు చేస్తూ అన్ని రంగాల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించింది అగ్ర భాగాన నిలిచిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తొమ్మిదేండ్లలో తెలంగాణ సాధించిన విజయాలను, ప్రగతిని ప్రతి ఒక్కరికి తెలియజెప్పేలా ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సహకారంతో భాగస్వామ్యులను గ్రామ, పట్టణ స్థాయిలో చేస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ విషయమై నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మంత్రి జగదీశ్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, రాష్ట్రాన్ని సాధించుకున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ తన అద్భుతమైన పరిపాలనతో అనేక రంగాల్లో విజయాలు సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతాంగానికి విశ్వాసం కలిగించారని, టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పించామని, తలసరి ఆదాయంలో దేశంలో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు.

రాష్ట్రం ఏర్పాటు తర్వాత వ్యవసాయ రంగంలో ఎక్కువ లాభపడిన జిల్లా నల్లగొండ జిల్లా అని జగదీశ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసిన ఉమ్మడి జిల్లా గత 4 సంవత్సరాలుగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా ఎదిగిందని అన్నారు.

అన్ని రంగాలలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఎంతో ప్రగతిని సాధించడం జరిగిందని, ఉపాధితో పాటు, ఉద్యోగం, వ్యవసాయం, వైద్యంలో, శాంతిభద్రతలు, పారిశ్రామిక రంగం, వ్యవసాయం ఇలా ఒకటేమిటి అన్నిరంగాలు అభివృద్ధిలో ముందునాన్నయని తెలిపారు.

గత తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిని అన్ని శాఖలు నివేదికల రూపంలో తయారు చేయాలని, ఈ సమాచారం మొత్తం జూన్ 2వ తేదీ లోపు ప్రజాప్రతినిధులందరికీ సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ రైతు దినోత్సవం మొదలుకొని జూన్ 22న నిర్వహించే అన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని, తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా కవులను, సత్కరించాలని, తెలంగాణ గిరిజన ఉత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజనులను పిలిచి కార్యక్రమాలు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించాలని మంత్రి జగదీశ్ రెడ్డి సూచించారు.

# సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి : మంత్రి ఐకేరెడ్డి పిలుపు..



నిర్మల్, మే 30: ముఖ్యమంత్రి కేసీఆర్ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని పట్టణంలో దివ్యా గార్డెన్స్‌లో నిర్వహించారు.

జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ముఖ్యకార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. జూన్ 4న సమీకృత కలెక్టర్ కార్యాలయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు.

అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సభకు పెద్దఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఆయనపై అభిమానంతో ప్రజలు భారీగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలను సభకు తీసుకొచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు.

# అచ్చంపేట అన్ని రంగాల్లో దూసుకుపోతోంది : మంత్రి హరీశ్‌రావు




నాగర్‌కర్నూల్, మే 30:జిల్లా పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. నియోజకవర్గం పరిధిలోని మన్ననూరులో బీటీ రోడ్డు పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, ఎంపీ రాములు, టీఎస్ ఎంఐడీసీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

గతంలో కరెంటో కావాలంటే ఎంతో గోసపడే వాళ్లం.. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఏడాదికి రెండు పంటలు పండించుకునే విధంగా సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. పండిన పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి వారి అకౌంట్లో డబ్బులు పడే విధంగా చేస్తున్నాం. ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం అని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు.

# రాజరిక వ్యవస్థ తెచ్చేందుకే పార్లమెంట్‌లో రాజదండం : చాడ వెంకటరెడ్డి

కరీంనగర్, మే 30:ప్రధాని నరేంద్ర మోదీ నూతన పార్లమెంట్ భవన్‌లో రాజదండం ప్రతిష్ఠించి రాజరిక వ్యవస్థను తీసుకురావడానికి కుట్ర రాజకీయాలకు తెరతీశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు.అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగ ప్రకారం దేశం లౌకిక రాజ్యాంగంగా కొనసాగుతున్న తరుణంలో రాజదండంతో బీజేపీ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రకారం దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభించాల్సి ఉండగా ప్రధాని మోదీ నియంతలా ప్రారంభించారని మండిపడ్డారు.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొత్తగా నిర్మించిన పార్లమెంట్‌కు అన్ని పార్టీలతో సమావేశంలో ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు ప్రారంభ కార్యక్రమం చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో బీజేపీ కొనసాగిస్తున్న అరాచక పాలనను వ్యతిరేకిస్తూ బీజేపీ హటావో, దేశ్‌కీ బచావో నినాదంతో సీపీఐ దేశ వ్యాప్తంగా సభలు, సమావేశాలను నిర్వహిస్తుందని వెల్లడించారు.కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కుమార్ కేంద్రం నుంచి ప్రజలకు అవసరమైన ప్రాజెక్టలను ఎందుకు తీసుకరావడం లేదో సమాధానం చెప్పాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మత విద్వేషాలు తప్ప ప్రజలకు చేసిందేం లేదన్నారు. ప్రజలు బీజేపీ పాలనతో విసుగు చెందారని, అందుకు నిదర్శనమే కర్ణాటక ఎన్నికల్లో ఓటమి అని పేర్కొన్నారు.

# కొండ వేణు మూర్తికి జీవన సాఫల్య పురస్కారం




కరీంనగర్, మే 30:(నేటినిజం ప్రతినిధి): హన్మకొండలో లయన్స్ అంతర్జాతీయ సేవ సంస్థ నిర్వహించిన తెలంగాణ లెవెల్ కంటి ఆసుపత్రిల సమావేశంలో లయన్స్ క్లబ్ అఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాదేకర్ కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణు మూర్తికి కంటి ఆసుపత్రి ద్వార చేస్తున్న సేవలకు గాను జీవన సాపల్య పురస్కారం అందజేశారు. ఇదే సమావేశంలో నేత్రదానం కార్యక్రమం లో విశేషమైన సేవ చేసినందుకు గాను ఇంజనీర్ కోలా అన్నా రెడ్డి కి అవార్డు నిచ్చారు. అత్యధిక ఆపరేషన్లు నిర్వహించి నందుకు గాను డాక్టర్ విజయ్ దేష్ముఖ్ కు అవార్డు ప్రధానం చేశారు. ఈ పురస్కారాల వల్ల మా బాధ్యత మరింత పెరిగిందని అవార్డు గ్రహీతలు వెల్లడించారు. అవార్డ్ గ్రహీతలకు పలువురు అభినందనలు తెలిపారు.

# ఉద్యోగాల పేరిట యువతను మోసగిస్తున్న ముఠా అరెస్టు




కరీంనగర్, మే 30:(నేటినిజం ప్రతినిధి): నిరుద్యోగులైన అమాయక యువతకు ఉద్యోగాల పేరిట గాలం వేసి వారి వద్ద నుండి లక్షల లక్షల రూపాయలు దండుకుంటూ ఆపై ముఖం చాటేసి, యువతను నిలువునా ముంచి, ఘరానా మోసానికి పాల్పడుతున్న ముఠాను కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి కటకటాలు పాలు చేశారు.

మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చెందిన మందల భాస్కర్ పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గంగారపు మధుమూర్తి చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన బత్తిని వైకుంఠం మరో ఇద్దరితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి గత కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగ యువకుల కు ఉద్యోగం ఇప్పిస్తానని వారి వద్ద లక్షలు లక్షలు వసూలు చేసుకుంటూ... ముఖం చాటేసి వారిని ముంచడం చేస్తున్నారు.

వీరి వల్ల నష్టపోయిన బాధితుడి ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసుకున్న ఇన్స్పెక్టర్ నటేష్ నిందితుల ముఠాను అరెస్టు చేయుటకు వారి కదలికలపై నిఘా ఉంచి వారిని అదుపులోకి తీసుకునుటకు ఒక ప్రత్యేక బృందాన్ని ఎస్సై రహీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందం నిందితుల కదలికలపై నిఘా ఉంచి వారిని మంగళవారం అదుపులోకి తీసుకొని వారిని విచారించగా వారు తమ నేరాన్ని అంగీకరించడంతో పాటు గత కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నామని ఒప్పుకున్నారని తెపారు. వారి వద్ద నుండి 93 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అరెస్టు చేసిన నిందితులు కోర్టులో హాజరు పరిచి వీరు ఇంకా ఎంతమందిని మోసం చేసినారని ఎంత మంది వద్ద ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసినారు అనే విషయంపై లోతుగా విచారణ చేసి తదుపరిచర్యలకు ఉపక్రమించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# శ్రీ గంగ పార్వతి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీర్వా దంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, మే 30:(నేటినిజం ప్రతినిధి): శ్రీ గంగా పార్వతీ శ్రీ రాజరాజేశ్వర స్వామి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని మూల వాగులో గంగపుత్ర సంఘం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న శ్రీ గంగ పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భం గా ఆది శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆది శ్రీనివాస్ వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలక రమేష్ చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కూర దేవయ్య, కోలాకాని రాజు, మర్రి పెల్లి రాజు, నాగుల మహేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# ఘనంగ దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు




రాజన్న సిరిసిల్ల, మే 30:(నేటినిజం ప్రతినిధి): ,ఏఐసీసీ సెక్రెటరీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, మంథని నియోజకవర్గ శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి యాచకులకు పండ్లు, చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారని వారు గుర్తు చేశారు. శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మరిన్ని ఉన్నతమైన పదవులు అనుభవించాలని వారు శ్రీ రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నారు. శ్రీధర్ బాబు కర్ణాటక ఇన్చార్జిగా ఉండి అక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో వారి పాత్ర కూడా ఉందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు సంగ స్వామి యాదవ్, కూరగాయల కొమరయ్య, ముడిగే చంద్రశేఖర్, పాత సత్య లక్ష్మి, భీమ్ రాజ్ కనకరాజు, నాగుల విష్ణు, పోతుగంటి వెంకన్న, మెంఢే రాజు, గరిపెల్లి శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

# అంతర్జాతీయ క్రీడా పోటీల్లో టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సత్తా.. అభినందించిన సజ్జనర్

హైదరాబాద్, మే 30:సౌత్ కొరియాలో ఈ మధ్య జరిగిన ఇంటర్నేషనల్ ఆసియా-పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు సత్తా చాటారు. సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఆర్చరీలో రెండు పతకాలను సాధించారు. జీడిమెట్ల డిపో కండక్టర్ ఎం.అంజలి ఆర్చరీ 18 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా.. కరీంనగర్ జోనల్ వర్క్ షాప్ మెకానిక్ కె.కిషన్ 30 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు.

హైదరాబాద్ లో ఫిబ్రవరిలో జరిగిన ఆలిండియా మాస్టర్స్ గేమ్స్లో వీరు సత్తా చాటడంతో ఇంటర్నేషనల్ ఆసియా-పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్కు ఎంపికయ్యారు. సౌత్ కొరియాలోని జియోన్బుక్ లో ఈ నెల 12వ తేదీ నుంచి 20వరకు ఈ పోటీలు జరిగాయి. వీరిద్దరి ప్రతిభను గుర్తించిన సంస్థ సౌత్ కొరియాకు వారిని పంపించడంతో రెండు పతకాలు సాధించారు. ఇంటర్నేషనల్ ఆసియా-పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్లో టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు సత్తా చాటి 2 పతకాలు సాధించడంపై సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని బస్ భవన్ లో ఇవ్వాల (మంగళవారం) పతకాలు సాధించిన ఎం.అంజలి, కె.కిషన్ ను అభినందించారు.

అంతర్జాతీయ క్రీడల్లో రాణించి రెండు పతకాలు సాధించడం సంస్థకు ఎంతో గర్వకారణం అన్నారు వీసీ సజ్జనార్. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో పాల్గొనే ఉద్యోగులకు టీఎస్ఆర్టీసీ అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. భవిష్యత్ లో జరిగే పోటీల్లోనూ పాల్గొని సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిరంతర కృషి, ప్రాక్టిస్తోనే క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. తమను సౌత్ కొరియా పంపించి ప్రోత్సహించిన సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ కు ఎం.అంజలి, కె.కిషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ యాదగిరి, సీపీఎం కృష్ణకాంత్, ఫిజియో హిమన్షు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ తుది రాత పరీక్షల్లో 84 శాతం మంది అర్హత..

హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమ్స్, ఈవెంట్స్, తుది రాత పరీక్షలు నిర్వహించారు. ఇక మిగిలింది ఫలితాల విడుదలే. ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఫలితాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీఎస్ఎల్పీఆర్బీ ప్రకటించింది. అయితే ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ తుది రాత పరీక్షల్లో 84.06 శాతం మంది అర్హత సాధించినట్లు టీఎస్ఎల్పీఆర్బీ వెల్లడించింది. ఈ పోస్టులకు సంబంధించి తుది రాత పరీక్ష రాసిన అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను టీఎస్ఎల్పీఆర్బీ వెబ్సైట్లో నేటి రాత్రి నుంచి అందుబాటులో ఉంచనున్నారు.

### రీకౌంటింగ్, రీవెరిఫికేషన్కు అవకాశం

అభ్యర్థుల మార్కులు నేటి రాత్రి నుంచి వెబ్సైట్లో అందుబాటులో ఉంటాయని టీఎస్ఎల్పీఆర్బీ వెల్లడించింది. ఫైనల్ కీ, ఓఎంఆర్ షీట్లు వెబ్సైట్లో చూసుకోవచ్చు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్కు అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 2 వేలు, ఇతర కమ్యూనిటీలు, నాన్ లోకల్ అభ్యర్థులు రూ. 3 వేలు చెల్లించి రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ చేసుకోవచ్చని సూచించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియ జూన్ 1వ తేదీ ఉదయం 8 గంటల నుంచి జూన్ 3వ తేదీ రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందిఎస్సీటీ పోలీసు కానిస్టేబుల్ సివిల్, ట్రాన్స్పోర్టు కానిస్టేబుల్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు 98,218(90.90 శాతం), ఎస్సీటీ ఎస్ఐ సివిల్ పోస్టులకు 43,708(75.56 శాతం), ఎస్సీటీ పోలీసు కానిస్టేబుల్ ఐటీ అండ్ సీవో ఉద్యోగాలకు 4,564(74.84 శాతం), ఎస్సీటీ ఎస్ఐ ఐటీ అండ్ సీవో పోస్టులకు 729(23.40 శాతం), ఎస్సీటీ పోలీసు కానిస్టేబుల్ డ్రైవర్, డ్రైవర్ ఆపరేటర్ ఉద్యోగాలకు 1,779 (89.53 శాతం), ఎస్సీటీ ఏఎస్ఐ ఎఫ్పీబీ ఉద్యోగాలకు 1,153(77.54 శాతం), ఎస్సీటీ ఎస్ఐ పీటీవో ఉద్యోగాలకు 463(79.97 శాతం), ఎస్సీటీ పీసీ మెకానిక్ పోస్టులకు 238(82.07 శాతం) మంది అర్హత సాధించారు.

# నేడు ఆరెపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం...

రాజన్న సిరిసిల్ల, మే 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లును బుధవారం ప్రతిమ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని వికాస్ రావు ప్రారంభిస్తున్నట్లు ఆరెపల్లి సర్పంచ్ ఇటిక్యాల నవీన రాజు తెలిపారు. మంగళవారం ఆరెపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి ప్లాంట్ ను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు కౌశిక్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ నవీన రాజు, ఎంపీటీసీ లహరిక శేఖర్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు మంచి నీటి సమస్య గురించి డాక్టర్ చిన్నమనేని వికాస్ దృష్టికి తీసుకురావడం జరిగిందని, వారి అభ్యర్థన స్పందించి ఉచిత మంచినీటి శుద్ధి జల కేంద్రంలో డొనేట్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలందరికీ సురక్షిత మంచినీరు అందించేందుకు ఈ ప్లాంట్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ సిబ్బంది దారం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# గ్రూప్1 ప్రీలిమనరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి

## జూన్ 11న ప్రిలిమినరీ పరీక్ష-జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్




కరీంనగర్, మే 30:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో టిఎస్ పిఎస్సి గ్రూవ్1 ప్రీలిమనరీ పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చీఫ్ సూపరిడెంట్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 11 ఆదివారం రోజు జరిగే గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 16829 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వీరి కోసం 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయలని విద్యుత్, త్రాగు నీరు, తదితర సౌకర్యాలు ఉండేల సరి చూసుకోవాలని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఏలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ఫోన్లకు అనుమతి లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్, శిక్షణా జాయింట్ కలెక్టర్ నవీన్ నికోలస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రాజ్యలక్ష్మి, తహసిల్దార్లు కనుకయ్య, సుధాకర్, నారాయణ, చీఫ్ సూపర్డెంట్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# డెయిరీ ఆవరణలో ఈద్గాహ్ కు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి

**-పవిత్ర బక్రీద్ మాసంలో నమాజ్ చేసుకునేందుకు వీలుగా త్వరితగతిన అనుమతి ఇవ్వాలి**
**-డెయిరీ కాంప్లెక్స్ లో 25 ఎకరాలు, చింతకుంటలో 8న్నర ఎకరాలు ఈద్గాకు కేటాయించిన భూమి నేటికి పెండింగులో ఉంది**
**-15 ఏండ్ల నుంచి ఈద్గా స్థలం వివాదాన్ని క్లియర్ చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు విఫలం**
**-ముస్లిం ఓట్లతో గెలిచి, ముస్లింలపై సవతి ప్రేమను కురిపిస్తున్న వారికి రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలి**
**-ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపు**




కరీంనగర్, మే 30:(నేటినిజం ప్రతినిధి): 2008లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో కరీంనగర్ పాల డెయిరీ వద్ద ప్రభుత్వ భూమిలో ఈద్గా కోసం కేటాయించిన 25 ఎకరాల భూమిని తిరిగి తక్షణమే పునరుద్ధరించాలని, రాబోయే పవిత్రమైనటువంటి బక్రీద్ మాసంలో ఈదుల్ జుహా నమాజ్ చేసుకునేందుకు వీలు కల్పించాలని, అందుకోసం ప్రభుత్వ అనుమతులతో కూడిన, ఎలాంటి వివాదం లేనటువంటి స్థలాన్ని తక్షణమే కేటాయించాలని, ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సీఎం కేసీఆర్ ను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్ నగర ముస్లింల సౌలభ్యం కోసం, భవిష్యత్ అవసరాలను, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని 2008 జులైలో ఆనాడు సీఎంగా ఉన్న దివంగత సీఎం వైఎస్సార్ వద్దకు వెళ్లి, ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ వెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారని, అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి మేరకు, కరీంనగర్ డెయిరీ కాంప్లెక్స్ 25 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ప్రకటించిందని, అప్పటి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ సుల్తానీయాను, సీఎం వైఎస్సార్ ఆదేశించారని, కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి, సబ్ డివిజన్ చేయించి, ప్రభుత్వానికి ఫైల్ పంపించారన్నారు. కానీ ఇది అమలు కాకుండా, సెక్యులర్ ముసుగులో ఉన్న ముస్లిం వ్యతిరేకులు కుట్రలు పన్ని, చింతకుంటలో 10 ఎకరాలకు, ఎనిమిదిన్నర ఎకరాలు కేటాయించిన భూమిని సైతం కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని దుయ్యబట్టారు. నాడు, ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉన్న కొందరు మతతత్వ వాదులు, సెక్యులర్ ముసుగు దొంగలు కుమ్మక్కై, స్థానికులతో కొర్రీలు సృష్టించి, కోర్టుల్లో కేసులు వేయించి, కరీంనగర్ లో ఈద్గాకు స్థలం ఉండొద్దని కంకణం కట్టుకొని మరి డెయిరీ భూమిని, చింతకుంట భూమిని దక్కకుండా కుట్రలు పన్నారని విమర్శించారు. నేటికి ఈద్గాకు వివాదాస్పద భూమే ఉంది తప్ప, క్లియర్ చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సైతం ముస్లింలు పవిత్రమైన ఈద్ నమాజ్ చదివే ఈద్గాలకు వివాదాస్పద భూములు ఇచ్చారే, తప్ప నేటికి

కోర్టు కేసులు పరిష్కరించలేదని పాలకుల తీరుపై మండిపడ్డారు. స్వరాష్ట్రం లోను గత 15ఏండ్ల నుంచి ఈద్గాకు కేటాయించిన రెండు స్థలాలు క్లియర్ చేయక పోవడం చూస్తుంటే పాలకులకు ముస్లింలపై ఉన్న అక్కసు, సవతితల్లి ప్రేమను అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక వర్గాన్ని తృప్తి పరిచేందుకు, కొందరు నేనే రాజు, నేనే మంత్రి, నాకు అడ్డు అదుపు ఎవరు లేరని విర్రవీగుతూ, ముస్లింల మనోభావా తో చెలగాట మాడుతున్నారని ఆరోపించారు. అన్ని వేళ్లు ఒకేలా లేవని, జీవితం ఒడిదుడుకుల మయమని, రాజకీయాల్లో హోదాలు, పదవులు శాశ్వతం కాదని, అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్న మాట గుర్తేరుగాలన్నారు. 25 ఎకరాల స్థలాన్ని డెయిరీ కాంప్లెక్స్ లో వచ్చే నెలలో రాబోయే బక్రీద్ నమాజ్ కోసం ఇస్తారా.. ఇవ్వరా అనేది స్పష్టం చేయాలని, లేకుంటే మౌనం అంగికారం అవుతుందన్నారు. గతంలో ముస్లింలకిచ్చిన హామీలు కాగితాలకే పరిమితమై, మాటలతో ముస్లింలను సంతోష పరుస్తూ, ముస్లిం ఓట్లతో గెలిచి, ముస్లింల పట్ల, ముస్లిం ప్రార్థనాలయాల పట్ల ఉదాసీనంగా మెతక వైఖరిని ప్రదర్శిస్తున్న వారిని రాబోయే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పేందుకు ముస్లింలు సిద్దమయ్యారని చెప్పారు.

# దశాబ్ది ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలి : స్పీకర్ పోచారం




కామారెడ్డి, మే 30: (నేటినిజం ప్రతినిధి): జూన్ 2 నుంచి ప్రారంభం కానున్న దశాబ్ది ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వాహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం బాన్సువాడ పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

జూన్ 2 న మొదటి రోజు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు.జూన్ 3 నుంచి వివిధ శాఖల ద్వారా ప్రతి రోజూ ఒక్కో అంశంపై ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు.'ఆశించిన ఫలితాలు రావాలంటే ప్రజాప్రతినిధులు కష్టపడి పని చేయలి, అధికారులను అప్రమత్తం చేయాలని' పేర్కొన్నారు.

శాసనసభ్యులు కష్టపడి పనిచేస్తే క్షేత్ర స్థాయిలో అద్భుతమైన ఫలితాలు వస్తాయని వెల్లడించారు. 'ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది.

చేసిన పనులను ప్రజలకు వివరించడం అందరి బాధ్యత' అని గుర్తు చేశారు. రైతు బీమా అందుకున్న రైతుల కుటుంబాలను పిలవాలి.పరిపాలన సౌలభ్యం కోసం నూతన జిల్లాలను, మండలాలను, గ్రామ పంచాయతీల ఏర్పాటుతో జరిగిన మేలును వివరించాలని కోరారు.

ఎన్టీరామారావు ప్రారంభించిన సంక్షేమ రంగాన్ని కేసీఆర్ కొనసాగిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో 2014 లో 1.08 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే నేడు 2.18 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ బి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.